క్లుప్తంగా

ఎంపీ అనురాధ పరామర్శ



కౌన్సిలర్ రాజేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం 22వ వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌ను ఎంపీ చింతా అనురాధ శనివారం పరామర్శించారు. ఇటీవల రాజేష్ తల్లి సూరమ్మ అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. స్థానిక 22వ వార్డులో రాజేష్ ఇంటి వద్ద సూరమ్మ చిత్రపటానికి ఎంపీ అనురాధ పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో ఎంపీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ఉన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

యానాం: పుదుచ్చేరి పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను పాలనాపరమైన కారణాలతో వాయిదా వేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ డాక్టర్ జి.శ్రీరాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ తేదీని త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

రెడ్ క్రాస్ ద్వారా సాయం అందజేత



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక గ్రామం గట్టువానిమెరకలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సభ్యులు సాయం అందజేశారు. గ్రామంలో బొమ్మిడి రవికుమార్ ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. రవికుమార్ కుటుంబానికి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ సఖిలే పెద్దిరాజులు శనివారం బియ్యం, వంట సామగ్రి, టార్పాలిన్, హైజనిక్ కిట్లు అందజేశారు. మండల పార్టీ కన్వీనర్ పి.శ్రీనురాజు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా త్రిముఖ గణపతి ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం: ముమ్మిడివరం బళ్ల గేటు సెంటర్ త్రిముఖగణపతి స్వామి వారి ఆలయ 13వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హైస్కూల్ ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహం

ఐ.పోలవరం: మండలంలోని జి మూలపాలెం హైస్కూల్ ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జి.మూలపాలెం సర్పంచ్ మందపాటి బైరవ మూర్తి, ఎంపీటీసీ కాటా సత్తిరాజు, గ్రామ కమిటీ ప్రెసిడెంట్ సత్తిబాబు, వర్మ మాస్టర్, కోయ రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

తాళ్లరేవు: ఐదేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌కు చెందిన వడ్డి భీమారావు అనే వ్యక్తి గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ దిశ డీఎస్పీ బీఎం జయరాం ప్రసాద్ విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చీలిక పెదవులకు ఉచిత శస్త్రచికిత్స

అమలాపురం టౌన్: చీలిక పెదవుల(గ్రహణం మొర్రి)తో బాధపడుతున్నవారికి మెషీన్ స్మైల్ సంస్థ కాకినాడ ప్రభుత్వ సర్వజనాసుపత్రి ద్వారా ఉచిత శస్త్రచికిత్స నిర్వహిస్తుంది. జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జిల్లా కో ఆర్డినేటర్, అమలాపురం డైస్ సెంటర్ ఇన్‌ఛార్జి డాక్టర్ జాన్ లెవి ఇంజేటి ఆధ్వర్యంలో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటరు (డైస్) ద్వారా అమలాపురం నుంచి కొంత మంది చీలిక పెదవులతో ఉన్న వ్యక్తులను ప్రత్యేక బస్సులో ఉచిత శస్త్రచికిత్సల కోసం కాకినాడ పంపించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ జాన్ లెవి తెలిపారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వ వైద్య సేవలు

- ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు మెరుగైన వైద్యం
- రెండు దఫాలుగా వైద్యుల పర్యటన

ఉప్పలగుప్తం: గత టీడీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో సరైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులతో సతమతమయ్యేవారు. ఉదయం ఆసుపత్రికి వెళితే డాక్టర్ ఓపీ చూసేంత వరకూ వేచి ఉండి విసుగు చెందేవారు. దీంతో చిన్న చిన్న రోగాలకు సైతం ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టి వేలాదిగా ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురయ్యేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత కల్పించింది. ప్రధానంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి తీసుకొచ్చి గ్రామాల్లో ప్రజల వద్దకే వెళ్లి 104 వాహనంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. నెలకు రెండు పర్యాయాలు వైద్యులు గ్రామాల్లో పర్యటించి 14 రకాల వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను అందిస్తున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో	
పీహెచ్‌సీలు	3
వైద్యులు	5
గ్రామాల్లో సీహెచ్‌వోలు	17

రెండు వేల జనాభాకు హెల్త్ క్లినిక్

గ్రామాల్లో ప్రతి 2 వేల మంది జనాభాకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, ప్రతీ క్లినిక్‌లో ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండేలా సీహెచ్‌వోలుగా ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లను ఏర్పాటు చేశారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే ఖర్చులు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీకు ఇద్దరు డాక్టర్‌లను ప్రభుత్వం నియమించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఒక వైద్యుడు 104తో వచ్చి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గ్రామాల్లో ఓపీని చూసి ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. మధ్యాహ్నం గ్రామాల్లో మంచంపైనే వైద్యం పొందుతున్న వారి ఇళ్లకు వెళ్ళి వారిని పరీక్షించి మందులను అందిజేస్తున్నారు. అనంతరం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలను, బాలింతలను, గర్భిణులను పరిశీలించి వారికి ఆరోగ్య రీత్యా సూచనలిచ్చి అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు.



ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్యులొచ్చి నా బాగోగులు చూస్తున్నారు



నేను గత పదమూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాను. దీనికి తోడు కాలు విరిగి ఆపరేషన్ జరిగింది. పక్కన మనిషి లేకపోతే ఏ పని చేసుకోలేను. వైద్యం కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో చాలా ఇబ్బందులు పడేదాన్ని. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక డాక్టర్‌లు, ఆశాలు ఇంటికి వచ్చి మరీ నా బాగోగులు తెలుసుకుని మందులిస్తున్నారు.

– గుత్తుల వెంకాయమ్మ, ఎస్.కొత్తపల్లి

ప్రభుత్వ సాయం మరవలేను



నా కుమార్తె పుణ్యశ్రీ పుట్టుకతో మూగ, చెవిటి. తను గర్భవతిగా ఉన్నప్పుడు ఫ్యామిలీ డాక్టర్‌లు, ఆశాలు నిరంతర పర్యవేక్షణ చేసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఆమె ఇప్పుడు బాలింతగా ఉంది. తరచూ వచ్చి తల్లీబిడ్డ బాగోగులు చూస్తున్నారు. ప్రభుత్వ సాయం మరవలేను.

– ఎం.శివరాజశ్రీ, గొల్లవిల్లి

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చింది. వైద్యులు గ్రామ స్థాయిలో నెలకు రెండు దఫాలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసేలా కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.ఢిల్లీ ప్రసాద్, వైద్యాధికారి, ఎస్.యానాం

రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతుంది

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- చొల్లంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని చొల్లంగి పంచాయతీలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరించారు. మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

20 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

చొల్లంగి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కాశి బుజ్జి, పులపకూర చినబాబు ఆధ్వర్యంలో సుమారు 20 మంది ఎస్సీ సెల్ యూత్ సభ్యులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైఎస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, బూరెల వెంకట్రాజు, కాపవరపు శ్రీదేవి, శివాజీ గణేష్, వారా సూర్యకుమారి, మాసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

మహిళలు స్వయం ప్రతిపత్తిని సాధించాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మహిళలు అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన స్వర్ణ సోషల్ సర్వీసెస్, క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో బోడసకుర్రు సచివాలయం వద్ద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్, ఎంపీటీసీలు దొమ్మేటి శ్రీకాంతి, బస్వాని పద్మ, టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్య దేశాన్ని శాసిస్తుంది

అల్లవరం: ప్రస్తుతం సాంకేతిక విద్య దేశాన్ని శాసిస్తుందని డైరెక్టర్ ఆఫ్ అకడమిక్స్ అండ్ ప్లానింగ్ విభాగాధిపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మురళీకృష్ణ, బెంగుళూరులోని హెడ్ ఆఫ్ క్యాంపస్ హైరింగ్ స్ట్రాటజీస్ రీతూశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతుల మీదుగా పట్టాను అందించారు. ప్రతి విభాగంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత బోనం కనకయ్య, కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వి.ధనరాజు తదితరులు పాల్గొన్నారు.



బీవీసీ కళాశాల టాపర్ రాజేశ్వరికి ఇంజినీరింగ్ పట్టాను అందిస్తున్న మురళీకృష్ణ

మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: యానాం నుంచి మద్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న అమలాపురం మున్సిపల్ కాలనీకి చెందిన కానేటి సత్తిబాబును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు పట్టుకున్నారు. ఏఎస్పీ ఖాదర్ బాషా ఆదేశాల మేరకు అమలాపురం ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ ఎస్ఎస్ వేణుమాధవ్, ఎస్‌ఐ సీహెచ్ స్వామిరెడ్డి, సిబ్బంది శుక్రవారం రాత్రి అమలాపురం ఎర్ర వంతెన వద్ద మాటు వేసి పట్టుకున్నారు. అమలాపురం మార్కెట్ సెంటర్‌కు చెందిన బుంగా శ్రీను అక్రమ రవాణాతో మద్యం సీసాలను తెచ్చి సత్తిబాబుకు ఇచ్చి అక్రమ అమ్మకాలకు పాల్పడుతున్నట్లు ఎస్‌ఈబీ దర్యాప్తులో తేలింది. సత్తిబాబును అరెస్ట్ చేసి అతని నుంచి 87 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో బుంగా శ్రీను పరారీలో ఉన్నాడని ఎస్‌ఈబీ సీఐ వేణుమాధవ్ తెలిపారు.

వైద్యులు దైవ స్వరూపులు

ఘనంగా వైద్యుల దినోత్సవం

అల్లవరం: ప్రాణాలు పోసే వైద్యులు దైవ స్వరూపులని, దేవుడు తర్వాత చేతులు ఎత్తి మొక్కేది వైద్యులకు మాత్రమేనని సర్పంచ్ వడ్డి సుభాషిణి అన్నారు. బెండమూర్లంక పీహెచ్‌సీలో తుమ్మలపల్లి సర్పంచ్ సుభాషిణి ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు బాల సబ్రహ్మణ్యం, ప్రియాలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్డి ఏలిషారాజు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంత సమాజానికి వైద్యుల కృషి

యానాం: ఆరోగ్యవంత సమాజ నిర్మాణంలో వైద్యులు కీలకపాత్ర వహిస్తున్నారని యానాం లయన్స్‌క్లబ్ పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను పేర్కొన్నారు. శనివారం వైద్యరంగానికి డాక్టర్ బిదాన్‌చంద్ర రాయ్ చేసిన సేవలను పురస్కరించుకుని స్థానిక యానాం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ పలాష్‌కుమార్ సన్యాల్, డాక్టర్ ఎస్‌కేవీ వర్మ, కాశి సత్యనారాయణ, పృథ్వీ, పెద్దిరెడ్డి రేణుక తదితర వైద్యులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు డీవీవీ సత్యనారాయణ, సతీష్‌చంద్ర, బెజవాడ నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శంకరరావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

వాకర్స్‌చే వైద్యులకు సత్కారాలు

అమలాపురం టౌన్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని, వైద్యుల ఆరాధ్యుడు డాక్టర్ బీసీ రాయ్ జయంతి వేడుకను స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్‌లు అమలాపురంలో శనివారం ఘనంగా నిర్వహించాయి. నియోజకవర్గంలోని పలువురు వైద్య నిపుణులను వాకర్స్ క్లబ్ తరపున ఘనంగా సత్కరించి అభినందించారు. అల్లవరానికి చెందిన సీనియర్ వైద్యులు బసవా వరహాలు, అమలాపురానికి చెందిన సీనియర్ వైద్యులు మెట్ల వెంకట సూర్యనారాయణ, సంసాని నిహారిక, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తదితరులను సత్కరించి అభినందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, రెండు క్లబ్‌ల ప్రతినిధులు పి.జాన్‌పాల్, యర్రమిల్లి అనంతలక్ష్మి, పచ్చిగోళ్ల సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



బెండమూర్లంకలో వైద్యులను సత్కరించిన సర్పంచ్ సుభాషిణి తదితరులు

అమలాపురం రూరల్: బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో వైద్యాధికారులు డాక్టర్ వాసు నాయక్, డాక్టర్ స్వర్ణకమలలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎం.మాధవి, ఎ.రాధ నరసింహం, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ఉప్పలగుప్తం: ప్రజలకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష అవకాశాన్ని కల్పించారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లిలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ 11 రకాల పౌర సేవలు ఉచితంగా పొందేందుకు వీలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కల్పించిన సువర్ణ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రజలకు నెల రోజుల పాటు ఈ సేవలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారి, యర్రంశెట్టి రామచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వెంకట సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఐ.పోలవరం: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా నెల రోజుల పాటు ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల సచివాలయం వద్ద శనివారం జరిగిన సమావేశంలో పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ అర్హులై ఉండి ఏఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపనతో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సర్వీసు చార్జి లేకుండా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం 1,271 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాశే రాజుబాబు, దేవస్థాన చైర్మన్లు పెన్మత్స వాసురాజు, కె.గంగబాబు, సుంకర నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అర్హత ఉండి సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు దూరమైన లబ్ధిదారుల్ని సైతం గుర్తించి వారికి సంక్షేమాన్ని అందజేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యానారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు అన్నారు. అమలాపురం మెట్ల కాలనీ గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉదయం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్సీలిద్దరూ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు యన్నాబత్తుల పద్మ, చిత్రపు రామకృష్ణ, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అన్ని శాఖల ధ్రువపత్రాలు పొందటానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఒక సదవకాశమని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగరపంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ సురాయి చెరువు సచివాలయ పరిధిలో శనివారం కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పెన్మత్స చిట్టిరాజు, బొంతు సత్యశ్రీనవాస్, కౌన్సిలర్లు కట్టా ఉమామహేశ్వరి, అడబాల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలో కొమానపల్లి, గేదెల్లంకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావులు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

తాళ్లరేవు: అర్హులందరికీ నూరుశాతం పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు అన్నారు. మండల పరిధిలోని పిల్లంక పంచాయతీలో శనివారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ దున్న శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత చింతలపాటి శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: నూరు శాతం సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గూడాలలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 664 మందికి వివిధ రకాల సర్టిఫికెట్‌లను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహసారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కొత్తపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



మురమళ్లలో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

ఆర్బీకేల్లో పంటల బీమా జాబితాలు

తాళ్లరేవు: ఖరీఫ్–2022 సీజన్‌కు సంబంధించి పంటల బీమా జాబితాలను మండల పరిధిలోని 12 ఆర్బీకే కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 3వ తేదీలోపు తెలియజేయాలన్నారు. మొత్తం 3487 మంది రైతులకు గానూ నష్టం వాటిల్లిన 1600 హెక్టార్లలో పంటకు సంబంధించి రూ.1.24 కోట్లు మంజూరయ్యిందన్నారు.

కాట్రేనికోన: మండలం పరిధిలోని 368 మంది రైతులకు రూ.71.8 లక్షలు పంటల బీమా లబ్ధి మంజూరైందని జిల్లా జేడీఏ వి.బోసుబాబు అన్నారు. చెయ్యేరులోని రైతు భరోసా కేంద్రాల్లో పంటల బీమా పథకం జాబితాలను ఆయన పరిశీలించారు. యూరియా, ఇతర ఎరువుల స్టాకును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన చేయాలి

ముమ్మిడివరం: ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన చేయాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ సూచించారు. ముమ్మిడివరం భవితా కేంద్రంలో శనివారం జిల్లాలోని ఐఈఆర్టీలకు నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని డైస్‌లో ఎంటర్ చేయాలన్నారు. పిల్లల తల్లితండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలను తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భీమారావు, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజోలు మండలంలో పనిచేసి పదవీ విరమణ చేసిన రామలక్ష్మిని సత్కరించారు.

రూ.1.49 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పనులు

యానాం: యానాం మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి, నిర్మాణ పనుల నిమిత్తం రూ.1,49,44,300 సీఎస్ఆర్ నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అతిథి గృహం ఎదురుగా ఉన్న న్యూమార్కెట్ కాంప్లెక్స్ డ్రెయిన్స్, ప్రత్యేక మరమ్మతులకు రూ.9.95 లక్షలు, కామరాజ్ నగర్ నుంచి ఫ్రెంచి ఛానల్ రోడ్డు, జీఎన్ నాయుడు కాలనీ వరకూ సీసీ రోడ్లకు రూ.9.95 లక్షలు, భారత మాత విగ్రహం నుంచి ఉమా మనోవికాస కేంద్రం వరకూ రూ.5.10 లక్షలతో సీసీ రోడ్డు తదితర పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతారని పేర్కొన్నారు.

న్యాయ సేవలపై బాధితులకు అవగాహన పెంచాలి



పారా లీగల్ వలంటీర్ల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: న్యాయ సేవలు బాధితులకు సత్వరమే అందేలా పారా లీగల్ వలంటీర్లు వారిలో న్యాయపరమైన అవగాహన పెంచాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ సూచించారు. స్థానిక కోర్టు భవనాల్లో పారా లీగల్ వలంటీర్లకు శనివారం జరిగిన శిక్షణ తరగతుల్లో న్యాయమూర్తి నరేష్ మాట్లాడారు. అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ మాట్లాడుతూ గ్రామాల్లో పారా లీగల్ వలంటీర్లు అవగాహన సదస్సులు విరివిగా నిర్వహించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు మాట్లాడుతూ న్యాయ చట్టాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణపై చైతన్యం నింపాలన్నారు.

నేడు గురు పూజోత్సవం

యానాం: యానాం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం గురు పూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ శాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. స్థానిక కామిశెట్టివారి వీధిలో గీతా మందిరంలో సాయంత్రం 6 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి సంస్కృత భారతి దక్షిణ ప్రాంత అధ్యక్షుడు మహోపాధ్యాయ దోర్భల ప్రభాకరశర్మ హాజరవుతారన్నారు.